బాలమిత్ర, సెప్టెంబరు 1996, పుట 56-57, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## కోరిక

షిర్డీలోని ఒక మారుమూల పెంకుటింట్లో ఓ బ్రాహ్మణ కుటుంబం ఉంది. భర్త పేరు శాస్త్రి, భార్య పేరు సావిత్రి. సావిత్రికి బాబా అంటే పరమ ప్రీతి, భక్తి. అయితే శాస్త్రికి అది నచ్చదు. "హిందువో, ముస్లిమో, ఏ జాతో, ఏ మతమో తెలియని అతను ఓ దేవుడా, ఓ పూజార్హుడా. నీకేమయినా పిచ్చి పట్టిందా ఆ సాధువుని కొలవటానికి" అంటూ భార్యని ఎప్పుడూ కేకలేస్తుంటాడు.

పైగా బాబా దగ్గరకు పోనివ్వడు, దర్శనం చేసుకోనివ్వడు. అనేక రకాల ఆంక్షలతో ఆమెను వేధిస్తుంటాడు. అయితే వారికి  చాలాకాలం వరకూ పిల్లలు కలగలేదు. సావిత్రి బామాని కొలిచి, "నీ పేరు పెట్టుకుంటా సాయీ, నాకో మగప్లిలవాడిని ప్రసాదించి నా కోరిక తీర్చు బాబా" అంటూ ప్రతినిత్యం ప్రార్థించడం ఆరంభించింది.

సర్వాంతర్యామి సాయికి తన భక్తురాలి దీనస్థితి తెలిసి ఆమెని దూరం నుంచే ఆశీర్వదించారు. అంతే కాదు - తన దర్శన భాగ్యం, భర్తకి కనువిప్పు కూడా కలిగించాలనుకున్నారు. బాబా దయ ఆమెకు లభించగానే ఆమె నెలతప్పి, నవ మాసాలు నిండటం, కొడుకును కనటం జరిగింది.

అయితే పేరుపెట్టే సమయంలో భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. "పిల్లాడు బాబా కృప వలన కలిగాడు. కాబట్టి 'సాయి'  అనే పేరు పెడదాం" అంటూ సావిత్రి - "ఆ ఏంకాదు ఆ ఏడుకొండలవాడి దయవలన పుట్టాడు కాబట్టి 'బాలాజీ' అంటూ నామకరణం చేద్దాం" అంటూ శాస్త్రి పట్టుపట్టి ఆఖరికి తన పట్టుదలే నెగ్గించుకుని బాలాజీ అని నామకరణం చేసేసాడు 'ఆ సాధువు పేరు మన యింట వద్దు' అంటూ.

నామకరణం పూర్తయింది. బంధువులంతా భోజనాలకు కూర్చోబోతుండగా హఠాత్తుగా ఆ చంటివాడు వెక్కివెక్కి ఏడ్చి ఏడ్చి వెక్కిళ్ళు రాగా కళ్ళు తేలేసాడు. ఏంచేసినా పిల్లాడు మామూలు స్థితికి రాలేదు. అందరూ కంగారు పడసాగారు ఆ హఠాత్పరిణామానికి. సావిత్రి ఏడుపు చెప్పనక్కర్లేదు. సరిగ్గా అదే సమయంలో బిక్షాటనకని బయలుదేరి వచ్చిన బాబా వారి యింటి ముందు నిలిచి "అల్లామాలిక్ సాయిరామ్ బాబా వచ్చాడు తల్లీ" అంటూ పిలిచారు. అన్నేళ్ళుగా బాబా ఎప్పుడూ వారి గుమ్మం ముందుకి రాలేదు, బిక్ష అడగలేదు. కానీ విచిత్రం ఆవేళ రావటం అనుకున్నారు అంతా శాస్త్రితో సహా. మరో సమయంలో అయితే శాస్త్రి చీదరించుకునేవాడే కానీ పరిస్థితి బాగుండక చూసి ఊరుకున్నాడు. సావిత్రి మాత్రం "బాబా నా కోరిక తీర్చి మగబిడ్డ నిచ్చారు.

వాడిప్పుడు అపాయంలో ఉన్నాడు. రక్షించండి బాబా" అంటూ సావిత్రి బోరున ఏడ్చింది. బాబా చేతిలో పిల్లాడిని పెడ్తూ.

బాబా చిరునవ్వు నవ్వుతూ, "వీడికిప్పుడేమయిందని అలా బాధపడుతున్నారు. వీడు నా రూపం, చిన్నసాయి. సాయి అంటూ పిలవండి పలుకుతాడు" అన్నారు.

సావిత్రి అలాగే పిలిచింది. శాస్త్రి కూడా తన పట్టు విడిచి "సాయి సాయి" అంటూ ఏడుస్తూనే పిలిచాడు. అంతే! పిల్లాడు కేర్‌మన్నాడు. అందరూ ఆశ్చర్యపోయారు ఆ వింతకీ, బాబా మహిమకీ.

శాస్త్రికి కనువిప్పు కలిగింది. బాబా కాళ్ళపైపడి బోరుమన్నాడు తనని క్షమించమంటూ. బాబా వారిని ఆశీర్వదించారు చిరునవ్వుతో. "నా భక్తురాలి కోరికమేర ఈ బిడ్డని నేనే ప్రసాదించాను. ఏ రూపంలో, ఏ నామంతో ఉన్నా పిలిచినా భగవంతుడొక్కడే. నీకు కనువిప్పు కలగటానికే ఈ నాటకం ఆడాను నేను. నామం విలువ తెలియటానికే సాయినామం పెట్టేట్లుగా చేసాను. సాయి అంటే నేనే కాదెల, ఈశ్వరుడు. నీకు పుట్టిన బిడ్డ ఈశ్వరాంశ సంభూతుడు సుమా" అంటూ ఆశీర్వదించి, వారిచ్చిన ఆతిధ్యం పుచ్చుకుని బాబా బయలుదేరారు.